క్లుప్తంగా

ఆర్బీకేల్లో ఎరువుల స్టాక్‌పై విచారణ



విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను విచారిస్తున్న వ్యవసాయాధికారులు

కోసిగి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల స్టాక్ రికార్డులను పకడ్బందీగా నమోదు చేయాలని ఎమ్మిగనూరు భూసారా పరీక్ష కేంద్రం వ్యవసాయధికారిణి ఎస్‌కే అమీరున్నీషా సూచించారు. బుధవారం కోసిగి వ్యవసాయ కార్యాలయంలో ఏఓ రాజు ఆధ్వర్యంలో మండలంలోని ఆర్బీకేలలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో ఎరువుల స్టాక్‌పై విచారణ చేపట్టారు. రబీ, ఖరీఫ్‌లలో ప్రభుత్వం కేటాయించిన ఎరువుల స్టాక్ రికార్డులు పరిశీలించారు. మండలంలోని సాతనూరు కేంద్రంలో 20-20-0-13, జుమ్మాలదిన్నె, జంపాపురం గ్రామాల్లోని కేంద్రాల్లో యూరియా స్టాక్ నిల్వ ఉందని గుర్తించారు. కేంద్రాల్లో స్టాక్ రికార్డులు,విక్రయాలు చేసి వచ్చిన నగదును ప్రభుత్వానికి జమ చేసిన రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా పనిచేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

ఆదోనిరూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ మండిగిరిలోని బీసీ హాస్టల్ ప్రాంతంలో నివాసముంటున్న ఎం.సురేష్ అనే వ్యక్తి గుండెపోటుకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి మట్టి ఖర్చులకై రూ.5 వేలు బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. అలాగే మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ సాయం అధికారుల చేతులమీదుగా అందజేశారు.

21న సినీ సంగీత విభావరి

ఆదోనిఅర్బన్: పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకొని అఖిల్ సినీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఈనెల 21న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బండారి మారెన్న, నాగరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. స్థానిక మంగళ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

డీలర్‌పై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు : తూకాల్లో ప్రజలను మోసం చేస్తున్న డీలర్ ఉచ్చప్పపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు జాఫర్‌పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వీరేంద్రగౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన డీలర్ ఉచ్చప్ప ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని ఒక్క కుటుంబానికి రెండు నుంచి మూడు కిలోలమేర తక్కువ అందించి మోసం చేస్తున్నాడని ఆరోపించారు. అంతేకాకుండా డబ్బులు కూడా అధికంగా వసూలు చేస్తూ చిల్లర అడిగితే వారిపై కోపం ప్రవర్తిస్తున్నాడన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆర్‌ఐ మహేష్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. సంబంధిత అధికారులు డీలర్‌పై చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, రామంజి, బడేసాబ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రెడ్డికి పితృ వియోగం



మృతిచెందిన సోమశేఖర్‌రెడ్డి (ఫైల్)

పెద్దకడబూరు: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డికి పితృ వియోగం సంభవించింది. మాజీ ఎంపీపీ బాపురం శకుంతలమ్మ భర్త, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తండ్రి సోమశేఖర్‌రెడ్డి (80) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు.ఆయన వారం రోజులుగా అనారోగ్యంతో ఆదోని, ఆ తరువాత కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే కోలుకోలేక మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి బుధవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

జోరుగా క్రికెట్ పోటీలు



ఆటకు సిద్ధమైన క్రీడాకారులు

కౌతాళం: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా బుధవారం మండల స్థాయి క్రికెట్ పోటీలు కొనసాగాయి.కౌతాళం-పొదలకుంట, హాల్వి-బాపురం, తోవి- కామవరం గ్రామాల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. మ్యాచ్‌లను ఎంపీడీఓ సుబ్బారాజు టాస్ వేసి ప్రారంభించారు. పీఈటీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు అలా.. నేడు ఇలా..!

నాడు అధ్వనంగా ఉన్న కాశమ్మ గడ్డ వంక రోడ్డు



నేడు సీసీ రోడ్డు వేసిన దృశ్యం



కోసిగి: మండల కేంద్రం కోసిగిలో కాశమ్మ గడ్డ కాలనీలో గతంలో వంక ఉండేది. కొండ ప్రాంతంలోని నివాసాల నుంచి డ్రైనేజీ నీరు, వర్షపు నీరు ఆ వంక వెంబడి ప్రవహిస్తూ నడవడానికి వీలు లేకుండా దుర్వాసన వెదజల్లుతుండేది. వంక ఒడ్డున నివాసం ఉండే వాళ్ల తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాత్రిళ్లు ఆ కాలనీకి వంక వెంబడి వెళ్లాలంటే భయాందోళన చెందేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సొంత నిధులు వెచ్చించి ఆ కాలనీలో డ్రైనేజీతో పాటు సీసీ రోడ్డు వేయించారు. దీంతో ఆ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బయటపడ్డ మరో దొంగతనం



బీరువాలోని వస్తువులను చెల్లాచెదురుగా పారవేసిన దృశ్యం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఇందిరానగర్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న టీచర్స్ కాలనీలో ఐదు దొంగతనాలు జరిగిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ ఇంటి వెనుకనే మరో దొంగతనం బుధవారం బయటపడింది. ఇంటి యజమానులు ఆదివారం రాత్రి తిరుపతికి వెళ్లారు. మంగళవారం రాత్రి ఇంటికొచ్చి చూస్తే ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడాన్ని చూసి నివ్వెరపోయారు. ఇంట్లో చూస్తే బీరువా తాళాలు పగలగొట్టి చెల్లాచెదారంగా ఉన్న విషయాన్ని గమనించిన వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం రాత్రి టూటౌన్ పోలీసులు పరిశీలించారు. రెండు తులాల బంగారం, రూ.10 వేలు నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఇంటి యజమాని ఉపాధ్యాయుడు గణేష్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు దేవా, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు చలపతి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహంతో పాటు స్మృతి వనం కూడా ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈనెల 19న నిర్వహించే కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆధ్వర్యంలో విజయవాడకు భారీ ఎత్తున యువత, అభిమానులు తరలివెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు అశోక్, చిన్నా, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీలు సురేష్, కిట్టు, ఎస్సీ సెల్ కార్యదర్శి వై.పి.గంగాధర్, కౌన్సిలర్ తాయన్న, దళిత సంఘాల నాయకులు బుడేకల్ బాబు, మధు, చిన్న, శీను, వై.పి.రవి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



బి.ఎన్.రోడ్డులో మందులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలో 24, 27 వార్డుల్లో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. బుధవారం 24వ వార్డులోని హవ్వన్నపేట అర్బన్‌హెల్త్ సెంటర్, 27వ వార్డుకు సంబంధించి బి.ఎన్.రోడ్డులోని శంకర్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించారు. శిబిరాలను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేయించుకోవాలన్నా వందల్లో ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు మందులను అందజేస్తుండటంతో ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు. జబ్బుల తీవ్రత పెరగకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుని మందులను పొందుతూ ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు.

కల్తీ నూనె విక్రయాలను అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పలు ఆయిల్ డిపోలు కల్తీనూనెను విక్రయిస్తున్నాయని వాటిని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, రైతు సంఘ తాలుకా కార్యదర్శి జబ్బార్ కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆయిల్‌డిపోల వారు కల్తీనూనె విక్రయిస్తుండటంతో అమాయక ప్రజలు కొనుగోలు చేసి రోగాలు కొనితెచ్చుకొంటున్నారన్నారు. మల్లికార్జున గౌడ్,వీరేష్, విజయేంద్ర, శాంతప్ప, ఖాజ, నరసింహులు, తిమ్మయ్య పాల్గొన్నారు.

వేలం వాయిదా

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తలనీలాలు వేలాలు మరోసారి వాయిదా పడ్డాయని ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ బుధవారం తెలిపారు. గతేడాది రూ.16 లక్షలకు వేలం దక్కించుకున్న పాటదారులు కేవలం రూ.10 లక్షల లోపు వేలం పాడుతుండడంతో అధికారులు నాల్గోసారి వేలం పాటలరె వాయిదా వేశారు. పాటదారులు సిండికేట్‌గా మారి తక్కువకు దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. గతంలో మూడుసార్లు నిర్వహించినా సరైన పాట రాకపోవడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల విజేత గాజులపేట వృషభాలు

తుగ్గలి : మౌలాలా స్వామి ఉరుసు సందర్భంగా బుధవారం ఉప్పర్లపల్లిలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో 7,014 అడుగులు లాగి గాజులపేట రమణయ్య వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను సర్పంచ్ ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. తర్వాతి స్థానాల్లో చాబాల కుల్లాయప్ప వృషభాలు, ఉద్దేనహాల్ ఉద్యాల బసన్న, పులికొండ రంగస్వామినాయుడు, మల్లేనిపల్లి విజయకుమార్ ఎద్దులు నిలిచాయి. యజమానులకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేల నగదు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్రనాథరెడ్డి, రామాంజి, బీమానాయక్ పాల్గొన్నారు.

పెయింటర్ ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు పాతబస్తీలోని ఖండేరి వీధికి చెందిన తెలుగు శేఖర్ (35) ఇంట్లో పేన్ల మందు తాగడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతిచెందాడు. ఈయన పెయింట్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తెల్లవారుజామున ఇంట్లో ఉన్న పేన్ల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య లలితమ్మతో పాటు ఇద్దరు కుమారులు సంతానం.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మందిని డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా ఉదయం సెషన్‌లో జరిగిన మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలకు 7,417 మందికి గాను 6,845 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఒకటవ సెమిస్టర్ పరీక్షకు 1029 మందికిగాను 903 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. చూచిరాతకు పాల్పడిన కర్నూలు డిగ్రీ కళాశాలలో- 5, డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో - 5, ఆళ్లగడ్డ ఎస్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో-2, కర్నూలు శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో-2, కర్నూలు వాసవీ మహిళా డిగ్రీ కళాశాల, పత్తికొండ విజయసాయి డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 17 మందిని డిబార్ చేసినట్లు తెలిపారు.

22న లక్ష పుష్పార్చన

కర్నూలు కల్చరల్: నగర శివారులోని రాగమయూరి గ్రీన్ హిల్స్ విద్యాసుందర సరస్వతి పీఠం సరస్వతి దేవాలయంలో ఈ నెల 22వ తేదీన సీతారామ లక్ష్మణ అభయాంజనేయ స్వామి వారికి లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అయోధ్యలో ఈ నెల 22వ తేదీన రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సరస్వతి దేవాలయంలో సాయంత్రం 4:30 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామానికి చెందిన గంపనెత్తి వెంకటేశ్వర్లుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన గంపనెత్తి మధుకుమార్ ఇంటి ముందు రోడ్డుపై ఉన్న సమయంలో వెంకటేశ్వర్లు బైక్‌పై అతివేగంగా రావంతో పిల్లలు తిరుగుతుంటారని, నెమ్మదిగా రావాలని సూచించగా ఇద్దరి మధ్య మాటా మాట పెరిగింది. దీంతో మధుకుమార్‌పై వెంకటేశ్వర్లు దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చెప్పారు.

కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా

ఆలూరు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్న వారిపై ప్రత్యేకంగా నిఘా వేసి చర్యలు తీసుకుంటామని ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్ తెలిపారు. హాలహర్వి, గూళ్యం, బాపురం గ్రామాల్లో నాటుసారా, కర్ణాటక టెట్రా ప్యాకెట్లను రవాణాదారులపై సిబ్బందితో బుధవారం విచారణ చేయించారు. అనంతరం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హొళగుంద, ఆస్పరి, మండల కేంద్రాలకు సమీపంలో అక్రమ మద్యం సరఫరాదారులపై దృష్టి సారించామన్నారు. అలాగే వన్నూరు, మార్లమడికి, గ్రామాల్లోని చెక్ పోస్టు అధికారులు సమాచారంతో దాడులు ముమ్మరం చేస్తామని చెప్పారు. ఎస్‌ఐ రాజశేఖర్, పోలీసులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గుంటుపల్లె జట్టు

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా నర్సాపురం గ్రామంలో సర్పంచ్ శీల ఈరమ్మ, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన 10 ఓవర్ల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వెల్దుర్తి మండలంలోని గుంటుపల్లె జట్టు విజేతగా నిలిచింది. వారం క్రితం ప్రారంభించిన టోర్నీలో 30 జట్లు పాల్గొనగా బుధవారం నాటి ఫైనల్‌లో నర్సాపురం, గుంటుపల్లె జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటుపల్లె జట్టు నిర్ణీత ఓవర్లలో 84 పరుగులు చేయగా, నర్సాపురం జట్టు 64 పరుగులకు ఆలౌటైంది. బహుమతి ప్రదాన కార్యక్రమంలో విజేత జట్టుకు రూ.15వేలు, రన్నర్స్ జట్టుకు రూ.10వేలు,ట్రోఫీలను వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు, కృష్ణారెడ్డి అందజేశారు. నాయకులు, నిర్వాహకులు బాలమద్ది, గంగాధర్, మహబూబ్ బాషా, ఎల్లరాజు, పి మధు, ఎమ్ మధు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మద్దికెర : స్థానిక బేతేలు ప్రార్థన ఆవరణలో ఆపద్బంధు సేవాసమితి, క్రిస్టియన్ అసెంబ్లీ ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ హాస్పిటల్ వారు బుధవారం ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. 145 మంది గుండె వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సేవా సమితి అధ్యక్షుడు సునీల్‌కుమార్, దైవ సేవకులు ఆనంద్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైతే ప్రభుత్వం కల్పించే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు.రాజశేఖర్, రాజు, మధు, గుండెవైద్య నిపుణులు రాంకుమార్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): చెరుకులపాడు క్రాస్ రోడ్డు వద్ద హైవే 44పై మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి వెల్దుర్తి మండలం, కలుగొట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫి గాయపడ్డాడు. డోన్‌లో నివాసముంటున్న రఫి కర్నూలు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సంక్రాంతి సెలవుల పొడిగింపు

ఆదోని సెంట్రల్: సంక్రాంతి సెలవులను మరో 3 రోజులు పొడగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈఓ బి.శివరాములు బుధవారం తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. 19వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉంది. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోరిక మేరకు ఈనెల 21వ తేదీ వరకు పొడిగించారు. తిరిగి పాఠశాలలు 22వ తేదీన తెరుచుకోనున్నట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కౌతాళం: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న నిరసన దీక్షలకు ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. బుధవారం నిరసన శిబిరంలో వారితో పాటు దీక్షలో కూర్చున్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, ఆదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న, నాయకులు బాలు, వెంకటస్వామి, పలువురు పాల్గొన్నారు.

ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట



ఆదోని ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఆదోనిటౌన్: నూతన సంవత్సరంలో మొదటి పండుగ అయిన మకర సంక్రాంతికి వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, బంధువులు, మహిళలు సొంతూళ్లకు చేరుకున్నారు. మూడు రోజులపాటు పండుగను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకొని బుధవారం వారివారి నివాస ప్రాంతాలకు తిరిగి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. దీంతో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బస్టాండ్ కిటకిటలాడింది. పలువురు అడ్వాన్స్‌గా రిజర్వేషన్లు చేయించుకోగా, రిజర్వేషన్‌లు లేని వారు అతి కష్టంపై ప్రయాణాలు సాగించారు. ఆదోని నుంచి బెంగళూరు, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, కడప, కర్నూలు తదితర ప్రాంతాలకు తరలివెళ్లారు.

గ్రామ పరిపాలనపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారాజు

కౌతాళం: గ్రామ పరిపాలనపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, వార్డు మెంబర్లకు అవగాహన ఉండాలని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. బ్లాక్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ) కార్యక్రమంపై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో వచ్చే నిధులు, వాటి వినియోగం, ఏఏ పనులకు నిధులు ఖర్చు చేయలన్న విషయాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, వార్డు మెంబర్లకు వివరించారు. వ్యవసాయాధికారి శేషాద్రి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నిధులను మౌలిక వసతులకు ఖర్చు చేయాలన్నారు. సమావేశంలో పరిపాలన అధికారి సత్యన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, కార్యదర్శులు అబ్దుల్‌వాహిద్, యోగేశ్వర్‌రెడ్డి, మంజునాథ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం అమర్నాథ్

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ పేర్కొన్నారు.రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక డిపోలో డ్రైవర్లు,కార్మికులతో ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ.. ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగాతీసుకెళ్లాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. డిపో సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ బాబు,ఎల్‌హెచ్ గంగన్న, కార్యాలయ సూపరింటెండెంట్ పంపాపతి, కార్మిక సంఘాల నాయకులు రఫీక్ అహమ్మద్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారికి క్రమం తప్పకుండా వైద్య సేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం స్థానిక ఎర్రబురుజులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం, శ్రీరామనగర్ పరిధిలోని జేఎస్‌ఆర్ నగర్ సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. టీకాల వల్ల పిల్లలను వ్యాధుల భారి నుంచి కాపాడవచ్చన్నారు. సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులచే అన్ని రకాల వ్యాధులకు చికిత్సతో పాటు ఉచితంగా మందులను అందిస్తారని, శస్త్రచికిత్స అవసరమైన వారికి ఉన్నత ఆసుపత్రికి రెఫర్ చేస్తారన్నారు.

రేపు జిల్లా ట్రెజరీలో చెక్కుల కాల్చివేత

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయం, జిల్లాలోని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో ఉండిపోయిన చెక్కులను శుక్రవారం కాల్చివేయనున్నారు. 2018 ఏప్రిల్ 1 నుంచి సీఎఫ్‌ఎంఎస్ అమలులోకి వచ్చింది. నాటి నుంచి మండల పరిషత్‌లకు, గ్రామ పంచాయతీలకు ఎలక్ట్రానిక్ చెక్కుల ద్వారా నిధులు విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల్లో మాన్యువల్ చెక్ బుక్కులు వృథాగా ఉండిపోయాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ట్రెజరీల్లోని స్ట్రాంగ్ రూమ్‌లను ఖాళీ చేయాల్సి ఉండటంతో కాలం చెల్లిపోయిన చెక్కు బుక్కులను దగ్ధం చేసేందుకు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ట్రెజరీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా జిల్లా ట్రెజరీలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను గురువారం తీసుకెళ్లాలని జేసీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయా శాఖల డీడీఓలు ట్రెజరీ కార్యాలయానికి రానున్నారు. జిల్లా ట్రెజరీలో 45, ఆదోని డివిజనల్ సబ్ ట్రెజరీలో 1 ప్రకారం 46 సేఫ్ కస్టడీ ఆర్టికల్స్ ఉన్నాయి. ఇందులో సీఐడీకి సంబంధించిన కేసు ఇంకా విచారణకు రానందున తమకు సంబంధించిన సేఫ్ కస్టడీ ఆర్టికల్‌ను జిల్లా ట్రెజరీలోనే భద్రపరచుకోవాలని లేఖ పెట్టినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వాటిలో మూడేళ్లు పైబడి ఉండిపోయిన వాటిని నేడు ఆయా శాఖలకు అప్పగించనున్నారు.

22 నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 22, 23 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా నారాయణపురంలో 45వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004 నుంచి 2007 సంవత్సరం మధ్య జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేస్తారని, త్వరలో మహారాష్ట్రలోని షోలాపూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

మందుల ఉత్పత్తిలో ఫార్మసిస్టులు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): మందుల పంపిణీ, ఉత్పత్తి జరిగే చోట తప్పనిసరిగా ఫార్మాసిస్టులు విధుల్లో ఉండాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫార్మసిస్టు ఆర్గనైజేషన్ సభ్యులు ఎం.బ్రహ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఫార్మసీ రంగం దినదినాభివృద్ధి చెంది ప్రతినిత్యం కొత్త కొత్త మందులు తయారవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి రంగంలో ఫార్మసిస్టుల కృషి, శ్రమ నైపుణ్యం ఎంతో ఉందని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం
97054 44304 (ఆదోని)
70750 09147 (మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com